'క్యూఆర్'.. ఈజీ టికెట్

- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి సేవలు
- క్యూలైన్లు లేకుండా టికెట్లు పొందే అవకాశం
- సాధారణ టికెట్లు, రిజర్వేషన్ టికెట్లు క్యూఆర్ కోడ్‌తో సులభం

చేతిలో డబ్బులు ఉండాల్సిన అవసరం లేదు. చిల్లర సమస్య లేనే లేదు... భారీ క్యూలైన్లల్లో వేచి ఉండాల్సిన అవసరం లేదు. అర్ధరాత్రి అయినా, అపరాత్రి అయినా టికెట్ బుకింగ్ కౌంటర్ సిబ్బంది కోసం పడిగాపులు కాయాల్సి అవసరం అంతకన్నా లేదు... ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల్లో డబ్బులు ఉంటే చాలు. సులభంగా మనం వెళ్లాల్సిన ఊరుకి క్యూలైన్‌లో కుస్తీలు పడకుండానే టికెట్ పొందొచ్చు. ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా టికెట్ పొందే సౌకర్యాన్ని దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కల్పించడంతో రైల్వే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఏటీవీఎంలో టికెట్ పొందడానికి క్యూ ఆర్ కోడ్ స్కానర్

అగనంపూడి : సాధారణ టికెట్లు మొదలు కొని రిజర్వేషన్ టికెట్లు కూడా ఈ సౌకర్యం ద్వారా తీసుకొనే వీలుకల్పించారు. ప్లాట్‌ఫామ్–1, 4ల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడంతో ప్రయాణికులు క్యూలైన్లలో కుస్తీలు పడాల్సిన అవసరం పోయింది. రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే టికెట్ తీసుకొని వెళ్లాల్సిన రైలుకు సిద్ధమయ్యే పరిస్థితి నేడు ఏర్పడింది. గతంలో జన్మభూమి, సింహాద్రి, రత్నాచల్, విశాఖ, గోదావరి, కాకినాడ, మచిలీపట్నం రైళ్ల కోసం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్లేవారు. వీళ్లంతా టికెట్ కోసం క్యూలైన్లలో ఉంటుండగానే రైలుబండి రావడం, టికెట్ లేకుండా ట్రైన్ ఎక్కేయడం, టీటీఈతో మాటలు పడడం, అదనపు సొమ్ములు చెల్లించి టికెట్ పొందడం జరిగేది. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని ప్రయాణికులు సంబరపడుతున్నారు. స్టేషన్‌కు రాకుండానే క్యూఆర్ కోడ్‌తో ఆన్‌లైన్ సాధారణ టికెట్ కూడా పొందే వీలు కల్పించారు. రిజర్వేషన్ టికెట్‌కు కూడా క్యూ ఆర్ స్కానర్


దువ్వాడ రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో ఏర్పాటు చేసిన స్కానర్

కోడ్‌ను స్కానింగ్ చేస్తే టికెట్ అందుతుంది. అలాగే రైల్వే స్టేషన్‌కు వెళ్లకుండానే మొబైల్ యాప్ ద్వారా సాధారణ టికెట్ పొందే వీలు దొరకడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆటోమెటిక్ టికెట్ వెండింగ్ మెషిన్ (ఏటీవీఎం) ద్వారా సులువుగా టికెట్‌ను తీసుకోవచ్చు. వీటిలో కూడా స్కానర్ అమర్చడంతో టికెట్ కోసం పాట్లు పడాల్సిన పరిస్థితి నుంచి గట్టెక్కినట్లు అయిందని ప్రయాణికులు అంటున్నారు.

క్యూ లైన్లతో కుస్తీలు పడాల్సిన అవసరం తప్పింది



గతంలో టికెట్ తీసుకోడానికి కనీసం అరగంట ముందు రైల్వేస్టేషన్‌కు రావల్సి వచ్చేది. ఆ సమయంలో పెద్ద ఎత్తున టికెట్ల కోసం క్యూ ఉండేది. ఫోన్‌పే ద్వారా చెల్లింపుల వెసులుబాటు కల్పించడంతో ఇప్పుడు ఆ సమస్య తీరింది.

–చట్టి తాతారావు, వెదుళ్లనరవ, ప్రయాణికుడు

చిల్లర సమస్యకు చెక్



యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ టికెట్ పొందడం, చెల్లింపులకు అవకాశం కల్పించడంతో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద డబ్బులు, చిల్లర సమస్య తీరింది. టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వకపోతే కౌంటర్ వద్ద సిబ్బంది నిలిపేశారు. టికెట్ ఇచ్చేవారు కాదు. చిల్లర మార్చుకొని రమ్మని చెప్పేవారు. ఇప్పుడు అలాంటి సమస్య లేదు.

–జొన్నకూటి విజయ్‌కుమార్, కూర్మన్నపాలెం

సంతోషంగా ఉంది



సాధారణ టికెట్‌తోపాటు రిజర్వేషన్ టికెట్లు కూడా మొబైల్ యాప్‌ల ద్వారా చెల్లింపులు చేసి టికెట్లు పొందే వీలు కలగడంతో సంతోషంగా ఉంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా రైల్వే టికెట్ పొందే సౌలభ్యం కల్పించడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. రైలు ద్వారా ప్రయాణం అంటే టికెట్ కోసం కుస్తీలు గుర్తుకు వస్తాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లకుండా టికెట్ పొందడం అంటే పాట్లు తప్పినట్టే.

–శంకరరావు, అగనంపూడి

ఘనంగా దానప్పతల్లి జాతర


అన్న సమారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి


కణితి, వడ్లపూడి నిర్వాసితకాలనీల్లో దానప్పతల్లి సారె ఊరేగింపు చేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి, వడ్లపూడి నిర్వాసితకాలనీల ఆరాధ్య దైవం దానప్ప తల్లి సారె, జాతర మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దుగ్గపువానిపాలెంలోని దానప్పతల్లి సారెను వడ్లపూడి, దుగ్గపువానిపాలెం, కాశీపాలెం కణితి, సంతమామిడి తోటల్లో సారె, ముర్రాతను ఊరేగించారు. ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభమైన సారె ఊరేగింపులో వందలాది మంది మహిళలు వివిధ రకాల మిఠాయిలు, పండ్లు, సారె, పసుపు కుంకుమలతో తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ లతీష్, బొండా జగన్, ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు డీవీ అప్పారావు, సర్లాన కొండలరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి శ్రీనివాసరావు, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీనివాసరావు, పూడి ఆనంద్, కోమటి రమాదేవి, పిన్నింటి సంతోష, మార్పు శేషు, బొడ్డ అప్పలసత్యం, బొండా గోవిందరాజులు పాల్గొన్నారు.

58 డిఫెన్స్ లిక్కర్ బాటిళ్ల స్వాధీనం


ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ మద్యం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక శ్రీ కన్య థియేటర్ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన డిఫెన్స్ బాటిళ్లను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం గాజువాక శ్రీకన్య థియేటర్ ప్రాంతంలో గెంబలి శేఖర్ వద్ద 750 ఎంఎల్ పరిమాణం గల 58 డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డిఫెన్స్ మద్యాన్ని నిల్వ చేసి అక్రమంగా విక్రయాలు జరుపుతున్నాడన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ ఆర్. ప్రసాద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో గాజువాక అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగ శ్రీనివాసరావు, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రవి కిరణ్, సబ్ ఇన్‌స్పెక్టర్ ముసల నాయుడు, నరసింహమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకులకు జరిమానా

గాజువాక మండల పరిధిలో 15 మంది బెల్ట్ షాపు నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ అధికారులు ప్రవేశ పెట్టారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున పూచీ కత్తుపై ఏడాది బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు.

అయ్యప్ప స్వామి దేవాలయంలో పడిపూజ


అలంకరణలో ఆలయంలో మెట్లు


పూజలందుకుంటున్న అయ్యప్పస్వామి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో శనివారం సాయంత్రం పడిపూజ నిర్వహించారు. శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయ సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 400 మంది అయ్యప్ప మాలధారణ భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో మెట్లను విశేష అలంకరణ చేపట్టారు. శ్రీ స్వామి అయ్యప్ప విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పడిపూజను పడమట గోవిందరావు దంపతులు విరాళంతో నిర్వాహణను చేపట్టారు. ఈ సందర్భంగా కలశ పూజ, మెట్ల పూజను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయ సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు కార్తీక మాసం చేపట్టిన భక్తులకు భారీ అన్నసమారాధన చేపట్టారు. రాత్రికి మాలధారణ భక్తులకు సద్దిని ఏర్పాటు చేశారు. దేవాలయ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎ.నాయుడు, శేషగిరిరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఉక్కునగరంలో..

ఉక్కునగరం: ఉక్కునగరం అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉక్కునగరం చెందిన భక్తులు తరలిరావడంతో ఉక్కునగరం అయ్యప్ప స్వామి నామస్మరణంతో మార్మోగింది. శనివారం నుంచి డిశంబర్ 27వరకు నిర్వహించనున్న అయ్యప్ప మండల పూజల్లో భాగంగా మండల దర్శనం ముందు శబరిమలై అయ్యప్ప ఆలయంలో వలే ఇక్కడ కూడా పెద్ద ఎత్తున పడిపూజ నిర్వహిస్తుంటారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ నేతత్వంలో అష్టాదశ దేవతలకు (18మెట్లు)కు పడి పూజలు చేసి అయ్యప్ప స్వామికి కర్పూర జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా గజ్జల శ్రీను బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లాప్ డ్రైవర్ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


క్లాప్ డ్రైవర్‌కి ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ క్లాప్ డ్రైవర్ల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి, శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గాజువాక జెడ్సీ శేషాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లాప్ డ్రైవర్లకు గుండె సంబంధిత, ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించారు. అంతకుముందు జోనల్ కమిషనర్ మాట్లాడుతూ నిత్యం చెత్త సేకరణలో ఉండే జీవీ ఎంసీ క్లాప్ డ్రైవర్లు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ, క్లాప్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మి, సుగుణాకర్ రాజు, సతీష్, గిరి, అనిల్, పైడిరాజు, బాబూరావు, మధు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథ పఠనంపై ఆసక్తి అవసరం


మాట్లాడుతున్న ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ

పెదగంట్యాడ: గ్రంథ పఠనంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యా శాఖాధికారులు కె.శ్రీనివాస్, రమణాజీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు అయిన శనివారం పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకర్తల స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల సర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 118 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీవీ రమణ పాల్గొన్నారు.

కులగణన లేకుండా వర్గీకరణ కమిషన్ చెల్లదు

ఉక్కునగరం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై ఉప కులాల తాజా కులగణన లేకుండా వర్గీకరణ కమిషన్ వేయడం చెల్లదని ఉక్కునగరం మాల మహానాడు కన్వీనర్ బూలా జగ్జీవన్ రామ్ అన్నారు. శనివారం ఉక్కునగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అవసరమైన సూచనలు చేయడానికి అంటూ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో నియమించిన ఏకసభ్య కమిషన్‌ను మాల మహానాడు కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పాత కులాల లెక్కలతో హడావుడిగా వర్గీకరణ చేసే ప్రభుత్వ ప్రయత్నాలను ప్రజా ఉద్యమం ద్వారా ఎదుర్కొంటామని, అవసరమైతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు. సమావేశంలో గుంజ చింతయ్య, బి.ఎ. స్వామి, జి. సురేష్, రాజీవ్, టి. గణేష్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ తరుపున పింఛన్లు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెద మడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ 65 మందికి పింఛన్లను పంపిణీ చేసింది. 15 ఏళ్లుగా ట్రస్ట్ తరపున నెలకు రూ.2వందల వంతున నిరుపేద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్‌తోపాటు రవాణా చార్జీలు అందిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా పెదమడకలోని ట్రస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పింఛన్ డబ్బులు అందించారు. అలాగే పేద విద్యార్థికి ఫీజు నిమిత్తం రూ.3వేలు అందజేసింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్ర రావు, చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, కార్యదర్శి జామి గణేష్, ప్రతినిధులు ఎం.మహేశ్వర రావు, పూడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కులో రౌండ్ టేబుల్ సమావేశం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఎస్ఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో కమీషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేయాల్సిన ఉద్యమ ప్రణాళిక కోసం ఈ సమావేశంలో చర్చించనున్నారు. స్టీల్‌ప్లాంట్ మాలలందరూ సమావేశంకు హాజరు కావాలని నిర్వాహకులు బయ్యే మల్లయ్య కోరారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

గాజువాక : బీజేపీని బూత్ స్థాయినుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంస్థాగత ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి సంస్థాగత ఎన్నికల నిర్వహణను నిర్మాణాత్మకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలందర్నీ భాగస్వాములను చేయాలన్నారు. మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సహా అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ బూత్ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గాజువాక నియోజకవర్గంలో 37వేల సభ్యత్వం నమోదు చేయడంపై నాయకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, లక్కరాజు సోంబాబు, సిరసపల్లి నూకరాజు, జీలకర్ర భువనేశ్వరి, వర్రి లలిత, బొండా ఎల్లాజీరావు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రుత్వికుల శివపార్వతుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈనెల 25న ఆఖరి సోమవారం సందర్భంగా పెద్ద ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు లచ్చయ్య, బాలాజి, సురేంద్ర, సుధాకర్, రమేష్ దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు.

ఇసుక లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన లారీ

పెదగంట్యాడ: ఓ లారీ యజమాని నిర్లక్ష్యం.. డ్రైవర్‌కు ప్రాణసంకటకంగా మారింది.. హైడ్రాలిక్ ఫెయిల్ కావడంతో ఒక్కసారిగా ఇసుక లోడుతో ఉన్న లారీ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక బీసీ రోడ్డులో బిల్డింగ్ మెటీరియల్ విక్రయిస్తున్న శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్‌కు శుక్రవారం ఓ లారీ ఇసుక లోడుతో వచ్చింది.. ఇసుకను డంప్ చేస్తుండగా హైడ్రాలిక్ ఫెయిలైంది. దీంతో లారీ ఒక్కసారిగా బోల్తా పడింది. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.లారీ బోల్తా పడిన సంఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించాల్సిన బిల్డింగ్ మెటీరియల్ యజమాని తనకేమీ పట్టనట్టు వ్యవహరించాడు. డ్రైవర్ చెవుల్లోంచి రక్తం కారుతున్నా పట్టించుకోలేదు. స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇచ్చినా స్పందన కరువైంది. 108 వాహనం కూడా చేరుకోకపోవడంతో తప్పని సరి పరిస్థితుల్లో స్థానికులు ఆ డ్రైవర్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలించారు.. శ్రీకాకుళానికి చెందిన లారీ ఓనర్ గొర్లె సింహాచలం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. లారీ కండిషన్‌ను పట్టించుకోకుండా వ్యాపారం.. లాభాపేక్ష తప్ప డ్రైవర్ భద్రతను గాలి కొదిలేశారని అంటున్నారు. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం, బాతువకు చెందిన గొండి సూర్యనారాయణ ఏడు నెలల నుంచి గొర్లె సింహాచలం వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బాతువ నుంచి శ్రీకాకుళం వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే లారీ బోల్తా పడిందని, డ్రైవర్‌కు గాయాలయ్యాయని సమాచారం అందుకున్న సింహాచలం దీమాగా సంఘటన స్థలానికి చేరుకున్నాడు. డ్రైవర్ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోకుండా లారీకి సంబంధించి ఇన్సురెన్స్ లావాదేవీల్లో తలమునకలయ్యాడు. ఇదిలావుంటే బాధితుడి నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి తెలిపారు. బీసీ రోడ్డుకు చేరుకున్న లారీలో అంత ఇసుక ఎలా వచ్చిందోనని స్థానికులు గుసగుసలాడుకున్నారు. ట్రాక్టర్లతో తవ్వి ఓ చోట చేర్చి అక్రమంగా లారీల్లో తరలించి ఉంటారని చర్చించుకుంటున్నారు.

హిందూజా భూ నిర్వాసితుల ఆందోళన

పెదగంట్యాడ: హిందూజా పవర్ ప్లాంట్‌కు సంబంధించి రైల్ కారిడార్, వాటర్ పైపులైన్‌ను వెంటనే నిర్మించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. అలాగే భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హక్కుల సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ హిందూజా పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న భూములను కూడా తీసుకుని నష్ట పరిహారం చెల్లించాలన్నారు. లేకపోతే వెంటనే రైల్వే ట్రాక్‌కు గుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. హిందుజా పవర్ ప్లాంట్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

బైకు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ రహదారిలో జరిగిన బైకు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. పాత గాజువాకకు చెందిన దానబోయిన చంచయ్య రియల్ ఎస్టేట్ కంపెనీలో సైట్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నాడు. చంచయ్య శుక్రవారం బైకుపై అచ్యుతాపురం సమీప మడుతూరుకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తుండగా ఉక్కునగరం సెక్టార్–11 పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి ముందు బైకుపై వెళ్తున్న వ్యక్తి ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా కుడి వైపునకు బైక్‌ను తిప్పాడు. దీంతో చంచయ్య ముందు బైకును ఢీకొని కింద పడ్డారు. ప్రమాదంలో గాయపడిన చంచయ్యను వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికు తరలించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛ వ్యాధిని తేలిగ్గా తీసుకోవద్దు

అక్కిరెడ్డిపాలెం: మూర్ఛ వ్యాధిని తేలికగా తీసుకోవద్దని షీలానగర్ కిమ్స్ హాస్పటల్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్.విజయ్ అన్నారు. ఆదివారం జాతీయ ఎపిలెప్సీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హాస్పటల్‌లో మూర్ఛవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూర్ఛ వ్యాధిపై ఆయన అవగాహన కల్పించారు.

తగిన జాగ్రత్తలతో ప్రీటెర్మ్ పిల్లల సంరక్షణ

నెలలు నిండకముందే పుట్టిన పిల్లల విషయంతో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఛీఫ్ నీయోనాటాలజిస్ట్ అండ్ నియోనాటాలజిస్ట్ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి అన్నారు. ఆదివారం ప్రీమ్యాచ్యూరిటీ డే 2024ను పురస్కరించుకొని ఆస్పత్రిలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రుల్లో సరైన డాక్టర్లు ఉన్న చోట ప్రసవాలు అయ్యేలా చూసుకుంటే నెలలు నిండకుండా ఉండే పిల్లల విషయంలో ఇబ్బందులు ఉండవన్నారు.

ములగాడలో కాలుష్యంపై అధికారుల ఆరా



మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో గల కోరమాండల్, ఆలూఫ్లోరైడ్ పరిశ్రమల వల్ల ములగాడ, ములగాడ విలేజ్‌లో విపరీతంగా కాలుష్యం వెలువడుతోంది. ఈ కారణంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు శీతాకాలం కావడంతో కాలుష్య సమస్య మరింత ఎక్కువవుతోంది. ఈ సమస్యపై స్థానికులు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేయడంతో... వారు స్పందించి శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కాలుష్యం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటికీ వెళ్లి స్థానిక నివాసులను అడిగి తెలుసుకున్నారు. ఆ రెండు గ్రామాల్లో ఆర్‌డీఎక్స్ బాక్స్ (ఆ ప్రాంతంలో కాలుష్యం ఎంత వరకు ప్రభావితం చేస్తుంది అని తెలుసుకునే పరికరం)లను ఏర్పాటు చేశారు. అందులో నమోదైన రీడింగ్‌ను అధికారులు ల్యాబ్‌కు తరలించారు. కార్యక్రమంలో ములగాడ విలేజ్ గ్రామ పెద్ద నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో దీపారాధన


షిర్డీసాయి శాంతి ధామంలో దీపారాధన

పెదగంట్యాడ: కార్తీక పాడ్యమి సందర్భంగా ఆలయాల్లో దీపారాధనలు, కుంకుమార్చనలతో పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని 73వ వార్డు సమతానగర్‌లో గల షిర్డీసాయి శాంతి ధామం ఆలయంలో శనివారం సాయంత్రం ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యంబాబు, కార్యదర్శి రవి శేఖర్ ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. ఓం, శివలింగం దీపాలతో రూపుదిద్దారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలను వెలిగించారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి వాలచెరువులో వేంచేసియున్న ఉమా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.